




# కరపత్రం

SINCE 2014


మంగళవారం ఏప్రిల్ 28, 2026 | సంపుటి : 2 | సంచిక : 197 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

### ఉద్యమంలో ఏది మాట్లాడినా చెల్లింది

- కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
- కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా
- ఆయన చావాలని తానెప్పుడూ కోరుకోలేదు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణ తరవాతే చర్యలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఏప్రిల్27 :**
బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదని, ఉద్యమ సమయంలో అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆయన స్పందించారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటే అని విమర్శించారు. వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పార్టీకి మనుగడ లేదు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో సంబంధాలు లేవు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి. ఆయన చావును నేనెందుకు కోరుకుంటానన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది. ఆయన మర మనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు. వివక్ష లేని పాలన మాది.. మాకు ప్రతిపక్షమే లేదు అని సీఎం అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని సీఎం అన్నారు.



## ప్రతి కుటుంబం ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి

- జనగణనతో పథకాల ప్రయోజనాలు సరిగ్గా అందుతాయి
- జనగణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఖమ్మంలో వివరాలను నమోదు చేసుకున్న భట్టి

**ఖమ్మం,ఏప్రిల్27 :**
రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 ప్రక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

- » ధాన్యం కొనే దిక్కుల లేకుండా పోయింది
- » బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- » ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- » బిఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- » తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధిరే కెసిఆర్




**హైదరాబాద్,ఏప్రిల్27 :**
రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం



- » ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- » హాజరైన సిఎం రేవంత్ తదిరులు

**హైదరాబాద్,ఏప్రిల్27 :**
ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

2లో..

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

- » 14 ఏళ్ల పోరాటంలో తెలంగాను ఐక్యం చేసిన జెండా
- » ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,ఏప్రిల్27 :**
దశాబ్దాలుగా అన్యాయనికి గురై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చన్నారు. కేసీఆర్25 ఏండ్ల క్రితం జలదృశ్యంలో గులాబీ జెండా ఎత్తిపట్టారని గుర్తు చేశారు. 14 ఏండ్ల తన పోరాటంతో తెలంగాణ జాతిని ఐక్యం చేసి సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ కలను సాకారం చేశారన్నాను. అడుగడుగునా పోరాటాలు చేస్తూ దిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్టాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు.

మిగతాద్ది 2 లో

## అనేక వర్సిటీలకు ఆంధ్రా దిక్సూచి

- » వర్సిటీలు మన చారిత్రక సంపద
- » ఈ యూనివర్సిటీ కోసం ఎందరో కృషి చేశారు
- » యూనివర్సిటీ అభివృద్ధికి 500 కోట్లు కేటాయింపు
- » శతాబ్ది ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి




**విశాఖపట్నం,ఏప్రిల్27**
దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఆంధ్రా యూనివర్సిటీ నే దిక్సూచి అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో శతాబ్ది మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మహోత్సవాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏయూ.. దేశంలోనే టాప్-5 యూనివర్సిటీల్లో ఒకటిగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఏయూకు రూ.500 కోట్ల నిధులు ఇస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. మరో రూ.500 కోట్లు కార్పస్ అభివృద్ధి కావాలని పేర్కొన్నారు. వర్సిటీలు మన చారిత్రక సంపద అని అభివర్ణించారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూలో రూ.64 కోట్ల పనులు ప్రారంభించామని సీఎం చంద్రబాబు వివరించారు. సాధారణ వ్యక్తి.. అసాధారణ శక్తిగా మారాలని విద్యార్థులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## తెలంగాణ పోలీసులకు గుడ్‌న్యూస్ చెప్పిన డీజీపీ



హైదరాబాద్:
తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పోలీసులకు శుభవార్త చెప్పారు. పోలీసుల పుట్టినరోజు, పెళ్లి రోజున ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు ఒత్తిడిలో పనిచేస్తూ వ్యక్తిగత జీవితానికి సమయం ఇవ్వలేకపోతున్నారని డీజీపీ తెలిపారు. వారికి మానసిక ఉల్లాసంతో పాటు కుటుంబ బంధాలు బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులు మినహా సిబ్బందికి సెలవులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఆధారాలు, దరఖాస్తు ఆధారంగా సెలవులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో 22 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ

## మాసాయిపేట వద్ద ట్రావెల్స్ బస్సు దగ్ధం



మూసాయిపేట:
మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద జాతీయరహదారిపై ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ప్రమాదం జరిగి సమయంలో బస్సులో ప్రయాణికులెవరూ లేరు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఘటనాస్థలి నుంచి డ్రైవర్ పరారయ్యాడు.

## తెలంగాణలో ఇంధన కొరత లేదు - పౌరసరఫరాల శాఖ



హైదరాబాద్:
తెలంగాణలో ఇంధన కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో తగినన్ని ఇంధన నిల్వాలున్నాయని వెల్లడించింది. వదంతులను పట్టించుకోవద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టి.. ఇంధనం నిల్వ చేయడం నేరమని హెచ్చరించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఏప్రిల్ 28, 2026

## బిఆర్ఎస్‌కు గతమే..భవిష్యత్ లేదు

మొదటిపేజీ తరువాయి

సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని.. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయన్నారు.మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అనేక వర్సిటీలకు ఆంధ్రా దిక్సూచి

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నంకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఇకనుంచి గ్లోబల్ సిటీ.. ఇక అన్‌స్టాపబుల్ అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ యూనివర్సిటీ స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తొలి వీసీ కట్టమంచి రామలింగారెడ్డి ఈ యూనివర్సిటీకి బలమైన పునాదులు వేశారని చెప్పారు. రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్.. దేశ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తు చేశారు. ఈ యూనివర్సిటీలో 58 దేశాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాష్ట్రంలో ఏయూని స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. తొలి వీసీ కట్టమంచి ఈ విశ్వవిద్యాలయానికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఏయూలో వందేళ్ల పండగ జరుగుతోంది. తెలుగు వైభవానికి కూడా ఏయూ కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయంలో 58 దేశాల విద్యార్థులు చదువుతున్నారు. విశాఖ ఇకనుంచి గ్లోబల్‌సిటీ.. దీని అభివృద్ధి అన్‌స్టాపబుల్. దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఏయూనే దిక్సూచి. వర్సిటీలు మన చారిత్రక సంపద.. వాటిని కాపాడుకోవాలి. ఏయూ చరిత్రలో ఇవాళ ఎంతో ముఖ్యమైన రోజు. వందేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం సాధారణ విషయం కాదు. ఏయూలో చదువుకుని ఎందరో భిన్న రంగాల్లో సత్తా చాటారు. ఇక్కడ చదవనందుకు నేను ఎంతో బాధపడుతున్నా. ఏయూ స్థాపన వెనక ఎంతో మంది కష్టం, త్యాగం ఉంది. ఈ యూనివర్సిటీ అభివృద్ధి కోసం అనేక మంది దాతలు సాయం చేశారు. ఈ వర్సిటీ రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా గర్వకారణం' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నేనూ కూడా ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థినే. విభిన్న ఆలోచనలున్న వారిని ఒక చోటికి తీసుకొచ్చే కేంద్రమే వర్సిటీ. ఇక్కడ చదువుకుని ఎందరో గొప్పవాళు అయ్యారని

దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. ఈ వేడుకల్లో దేశ ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దైన్యంగా
# రైతుల పరిస్థితి

మొదటిపేజీ తరువాయి

సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్,
# అజారుద్దీన్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది
## బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలి

**– బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదుగుదల పరంగా తనకెంతో ఉపకరించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయినప్ప టికీ ఈ లేఖ ద్వారా తన మనోభావాలని రాష్ట్ర ప్రజలందరితోనూ పంచుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణుల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో అసాధారణ శక్తిని తాను అనుభూతి పొందానని, తీవ్రమైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. 'ఈ ర్యాలీలు, రోడ్‌షోలు నాకొక యాత్రలాంటి అనుభూతినిచ్చింది. మా కాళి భక్తులతో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన శక్తిని నింపుతున్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరిలో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచారంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకు కలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదలించే ఎన్నో మెసేజ్‌లు, ఫోటోలు తనకు అందాయని, వాటిని ఎప్పటికీ మరచిపోలేనని మోదీ తెలిపారు. ఎంత అర్ధరాత్రయిన వీలు చూసుకుని వాటిని చదవడంతో పాటు స్పందిస్తుంటానని చెప్పారు. యువకులు, మహిళలు, ఆడకూతుళ్లు, పెద్దలు సహా అన్ని వయస్సుల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, వారే తనకు అత్యంత విలువైన సంపద అని అభివర్ణించారు. బెంగాల్ సత్వర అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్న విషయం తాను గ్రహించానని, యువత ప్రగతిపథం వైపు దూసుకువెళ్లే అవకాశాల కోసం, ఆడకూతుళ్ల ఆకాశమే హద్దుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం, భద్రత కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రజలంతా మార్పు కావాలనే ఏకైక సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని తెలిపారు. సురక్షిత బెంగాల్‌కు తాను బాధ్యత తీసుకుంటానని, సవాళ్లను అవకాశాలుగా మార్చేందుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపే ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రజలంతా కలిసివస్తారనే నమ్మకం నాకుంది. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన బెంగాల్‌ను నిర్మించుకుందాం' అంటూ ప్రధాని ఆ లేఖను ముగించారు.

## ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' దే విజయం
# విభజన శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఇదే

**– బెంగాల్ ప్రజలను కోరిన సిఎం మమతా బెనర్జీ**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజయం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పికొట్టాలని ఓటర్లను కోరారు. 'మా-మాటి-మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కాలమే సమాధానమిస్తుంది' అని అన్నారు. ఆదివారంనాడు తాను జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వకారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలుదిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తీ దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెంగాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. ‘‘రాష్ట్ర అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతారనే నమ్మకం తనకు ఉందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించదగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షించుకోవాలి. కులం, మతం, భాష, నేపథ్యంతో సంబంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరపూల్ గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమతా బెనర్జీ కోరారు. భవానీపూర్ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈనెల 29న జరుగనున్న తుది విడత పోలింగ్‌లో భవానీపూర్ నియోజకవర్గం కూడా ఉంది. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ పోలింగ్‌లో తొలి విడత పోలింగ్ ఈనెల 23న జరిగింది. అనూహ్యంగా 93 శాతం పోలింగ్ నమోదైంది. అయితే భారీ పోలింగ్ తమకే అనుకూలమని, పోలింగ్ జరిగిన 152 నియోజకవర్గాల్లో 110 స్థానాలను తాము గెలుచుకోనున్నామని బీజేపీ ధీమా వ్యక్తం చేసింది. బీజేపీ వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వరుసగా నాలుగోసారి టీఎంసీ అధికారంలోకి రానుందని చెప్పింది. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## త్వరలోనే తెలంగాణలో సర్ ప్రక్రియ
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పక్రియను భారత ఎన్నికల సంఘం నిర్వహించనున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది. చట్టం ప్రకారం ఓటర్ల జాబితాను సవరించడానికి భారత ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణ చేయాలని కమిషన్ ఆదేశిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో తరచూ జరిగే వలసల వల్ల ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేరు నమోదు చేసుకోవడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వల్ల పలు సమస్యలు ఏర్పడ్డాయన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను భారత ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2002లో జరిగిన చివరి సవరణద్వారా ఉన్న వారి పేర్లు లేదా వారి బంధువుల పేర్లతో సరిపోల్చే పక్రియను నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలి. ఓటర్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ఎంపిక ద్వారా తెలుసుకోవచ్చు. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితా రూపంలో కూడా అందుబాటులో ఉంది. తమ పోలింగ్ స్టేషన్ తెలిసిన వారు కూడా తమ పేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇక ఓటరు పేరు 2002 ఎన్నికల జాబితాలో కనపడకపోతే, అతను/ఆమె ఆ సమయంలో నమోదు కాలేదని అర్థం. అటువంటి సందర్భంలో, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను వెతికి, వాటిని ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితా ముద్రిత ప్రతులు బూత్ లెవెల్ ఆఫీసర్ వద్ద అందుబాటులో ఉంటాయని, వారు మీకు సహాయం చేస్తారని తెలిపారు. ఎన్యుమరేషన్ దశలో ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే, 2002 జాబితాతో సరిపోల్చలేని ఓటర్లకు నోటీసులు జారీ చేయబడతాయన్నారు. వారి అర్హతను నిరూపించడానికి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

## సచివాలయంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నెదుట రాష్ట్ర సచివాలయంలో అగ్నిమాపక శాఖ, ఎస్.ఆర్.ఎఫ్ లు సంయుక్తంగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాయి. సచివాలయం లోని అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ అవగాహన కార్యక్రమంలో అగ్ని భద్రతా చర్యలపై అవగాహన తోపాటు అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై అగ్ని భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక అగ్ని భద్రతా చర్యలు, ఎవాక్యుయేషన్ డ్రిల్స్ విధానం, అత్యవసర ప్రతిస్పందన విధానాల ప్రాముఖ్యతపై వివరంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే మూలాలు, అగ్ని భద్రత, , రక్షణ చర్యలను లైవ్ డిమానిస్ట్రేషన్ ద్వారా వివరించారు.ఈ సంద్రాభంగా అగ్నిమాపక శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనారాయణ, సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి దేవీదాస్, .డీ.ఎఫ్.ఓ లు వెంకన్న, శ్రీనివాస్, ప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా, తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ బృందాలచే ప్రత్యక్ష ప్రదర్శనలు (లైవ్ డెమోస్), మాక్ డ్రిల్‌లు నిర్వహించారు. ÷ర్ ఎక్టింగ్విషర్లు, ÷ర్ హైడ్రెంట్లను ఉపయోగించే విధానం, అత్యవసర పరిస్థితుల్లో ఎవాక్యుయేషన్ విధానాలపై శిక్షణ ఇచ్చారు. అగ్నిప్రదాం సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలు, లిఫ్ట్ లను ఉపయోగించకపోవడం, కేవలం మెట్ల మార్గం ద్వారానే వెళ్లడం తదితర చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

## సీనియర్ పాత్రికేయుడు మధుసూధన్ మృతి

**– సిఎం రేవంత్, భట్టి తీవ్ర సంతాపం**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో మృతి చెందారు. అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థల్లో ఆయన సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిజాయతీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. మధుసూదన్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన హఠాన్మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. సమాచార కమిషనర్ ముకుంద రెడ్డి కూడా సంతాపం ప్రకటించారు.

## త్యాగాల పునాదులపై
# ఏర్పడ్డదే బిఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి.. మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితం అవుతుందని అన్నారు. సాధించిన తెలంగాణ కోసం అధికారం అప్పగిస్తే పదేండ్ల కాలంలో బాధ్యతగా పని చేసి అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కానీ, రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఆరాచక పాలన మొదలైందన్నారు. కాంగ్రెస పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల తరఫున పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ బాధ్యత అప్పగించినా బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు స్వీయ రాజకీయ అస్తిత్వం ఉండాలని ప్రొ.జయశంకర్ అనేవారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేదాకా దండుగా కదం తొక్కుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ దిశానిర్దేశర కోసం గులాబీ దండు ఎదురుచూస్తోందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలకు, జర్నలిస్టులకు,కవులు, కళాకారులు, ఉద్యోగులు సమస్త ప్రజానికానికి వినమ్ర ధన్యవాదాలు తెలిపారు.

## బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు
## తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

## లద్దాఖ్‌లో కొత్తగా పదు జిల్లాలు

**– కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ**
**– ఎక్స్ వేదికగా వెల్లడించిన లెఫ్ట్‌నెంట్ గవర్నర్**


కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుకానున్నట్టు లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సోమవారంనాడు ప్రకటించారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఎల్జీ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ప్రకటించారు. ఇదొక చరిత్రాత్మకమైన రోజని, ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. ప్రస్తుతం లద్దాఖ్‌లో లెహ్, కార్గిల్ జిల్లాలు ఉన్నాయి. కొత్తగా ఆమోదించిన ఐదు జిల్లాలతో వీటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని సక్సేనా తెలిపారు. కొత్తగా ఏర్పడనున్న జిల్లాల పేర్లను నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్‌గా ఆయన పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందని, వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని తెలిపారు. పాలనను నేరుగా ప్రజల దగ్గరకు తీసుకు వెళ్లడంతో ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ పరివర్తనాత్మక నిర్ణయానికి 2024 ఆగస్టులో హోం శాఖ ఆమోదం తెలిపిందని అన్నారు. ఏరియా పరంగా లద్దాఖ్ అతిపెద్ద కేంద్ర పాలిత ప్రాంతం కాగా, జనాభా పరంగా చిన్నది. చైనా, పాకిస్థాన్‌తో 86,904 చదరపు కిలోమీటర్ల సరిహద్దు కలిగి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ 2.74 లక్షల జనాభా ఉన్నారు. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత 2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం విభజించింది. లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతం నేరుగా కేంద్ర హోం శాఖ పాలనలో ఉంది.

# పెళ్లి పేరుతో మోసం

## » మోసం చేసి యూకే పారిపోయిన యువకుడు

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి
మేడ్చల్ జిల్లాలో హాగో యాప్ ద్వారా పరిచయమైన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరక సంబంధం పెట్టుకుని, అనంతరం యూకేకు పారిపోయిన యువకుడిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

» 2023 ఆగస్టులో పెళ్లి చేసుకుంటానని చెప్పి, గర్భవతి అయిన యువతికి బలవంతంగా గర్భస్రావం చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు



» 2025 మే 4న నిశ్చితార్థం తర్వాత విదేశాలకు వెళ్ళిన నిందితుడు, డిసెంబర్ వరకు మాట్లాడి, పెళ్లి చేసుకోనని చెప్పినట్లు బాధితురాలు తెలిపింది

నిందితుడి కుటుంబ సభ్యులు కూడా వివాహానికి అంగీకరించలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.పోలీసులు లోహిత్, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోరుట్లలో న్యాయవాదిపై దాడి

## » తగిన చర్యలు కోరుతూ న్యాయవాదుల నిరసన



**కోరుట్ల ప్రతినిధి, కరపత్రం**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సీనియర్ న్యాయవాది గంగుల సత్యార్థప్రకాశ్ పై జరిగిన దాడిని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. సోమవారం కోర్టు విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ, న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. నిందితులను వెంటనే పట్టుకొని శిక్షించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు.

# మెట్పల్లి సిఐ గా బాధ్యతలు చేపట్టిన సిఐ సురేష్ బాబు




**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సురేష్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఎస్పీ సురేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

# వెల్లుల్ల గ్రామంలో హెచ్‌పివి టీకా కార్యక్రమం




**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో 100% హెచ్‌పివి టీకా లక్ష్యంతో, గ్రామ సర్పంచ్ గూడూరు రజిని ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి టీకాలు వేయించేందుకు చర్యలు చేపట్టారు. అర్హత గల ప్రతి బాలికకు ఆరోగ్య రక్షణ కోసం టీకా తీసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఈ ముందడుగును వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు.

# స్వయంగా స్వీయ జనగణనప్రతి ఒక్కరూ పాల్గొనాల్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, జనాభా లెక్కల స్వీయ గణన-2027 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు https://se.census.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి Self Enumeration (HLO) Login ఎంపిక చేసుకుని తెలంగాణను సెలెక్ట్ చేసి క్యాప్చా నమోదు చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

# మేడ్చల్ లో భారీ వర్షం

## » ట్రాఫిక్ కు అంతరాయం

**కరుణాకర్ మల్లి గారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ సర్కిల్ లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకు ఒరిగిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా మేడ్చల్-శామీర్‌పేట్ రహదారి, గుండ్లపోచంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయినట్లు సమాచారం.



# శవ రాజకీయం తగదు.. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

▪ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, ఏప్రిల్ 27**
రాజకీయ విమర్శలు సహజమే కానీ శవ రాజకీయం చేయడం తగదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటీవల మృతి చెందిన కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. రాజకీయంగా ప్రశ్నించడం సహజమేనని, కానీ శవ రాజకీయం చేయడం తగదని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని తెలిపారు. ఇటీవల మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న



నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ నేతలు, ముఖ్యంగా బండి సంజయ్ కుమార్, ఆ కుటుంబానికి కనీస సహాయం కూడా చేయలేదని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఎలాంటి లాభం చేకూరలేదని అన్నారు.గతంలో అధికారంలో ఉన్నప్పుడు కేవలం 30 రోజులు కూడా ప్రభుత్వం నిలబడలేదని విమర్శిస్తూ, తమ ప్రభుత్వం మాత్రం గంటల వ్యవధిలోనే ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచిందని తెలిపారు. చర్చల సమయంలో ప్రత్యర్థి పార్టీల రాజకీయ దురుద్దేశం బయటపడిందని పేర్కొన్నారు.శవ రాజకీయం, మత రాజకీయం చేయడం బీజేపీకి అలవాటైందని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితిలో ఉన్న వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని అన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో బీజేపీ పరిస్థితి మరింత దిగజారుతుందని, "డబుల్ ఇంజన్ కాదు.. ఉన్న ఇంజన్ కూడా పోతుంది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి బీజేపీ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ సమ్మెపై మాట్లాడితే ప్రజలు అంగీకరించరని, గత పాలనలో ఆర్టీసీ ఆస్తులు అమ్ముకున్నారని విమర్శించారు. వరంగల్ జిల్లా ఆర్టీసీ కార్మికుల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యర్థి పార్టీల నేతలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నప్పటికీ అవి నిజాలు కావని, ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గత 20 ఏళ్లుగా జిల్లాను అభివృద్ధిలో వెనక్కి నెట్టిన నాయకులు మళ్లీ కపట వేషాలతో ముందుకు వస్తున్నారని హెచ్చరించారు. ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గుడిమల్కాపూర్‌లో ఘనంగా బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కార్వాన్, ఏప్రిల్ 27:**
భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడిమల్కాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రజతోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జి ఠాకూర్ జీవన్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### కేక్ కట్ చేసి సంబరాలు

అనంతరం పార్టీ శ్రేణుల మధ్య జీవన్ సింగ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారులను మరియు సీనియర్ నాయకులను ఆయన ఘనంగా సన్మానించారు. సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాస్ మరియు గుణాల రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



### కేసీఆరే మళ్ళీ సీఎం కావాలి: నేతల ఆకాంక్ష

ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీ ఎదుగుదల వరకు తాము చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్ళీ రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారని నాయకులందరూ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అందరూ పరస్పరం లడ్డూలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, రోడ్డు శ్రీధర్, కడెం గారి శేఖర్, జ్యోతి రాజు, ఆదిత్య యాదవ్, మధు యాదవ్, క్రాంతి యాదవ్, సత్యనారాయణ



పటేల్, తిరుమలేష్, నరేష్, రమణ, సుమేర్, పొట్లూరి రఘుతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేసిన స్వర్గీయ "కొమ్మిరెడ్డి దంపతులు"

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 27**
తెలంగాణ గౌరవ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ మాజీ శాసనసభ్యులు, సుప్రీంకోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు కొమ్మిరెడ్డి రాములు, శ్రీమతి కొమిరెడ్డి జ్యోతి దేవి ల జ్ఞాపకార్థం హైకోర్టు ఆవరణలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసారు . ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి మాట్లాడారు. న్యాయ కోవిదులు, 50 ఏళ్లకు పైగా తమ జీవితాన్ని న్యాయవాద వృత్తికి, ప్రజాసేవకు అంకితం చేసిన మెట్పల్లి మాజీ శాసనసభ్యులు, హైకోర్టు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కొమిరెడ్డి రాములు, జ్యోతక్కల సేవలు అజరామరమని కొనియాడారు. లౌకికవాదం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం వారు నిరంతరం




శ్రమించారని అన్నారు. అటు ప్రజా సేవలో, ఇటు పలు కేసుల్లో వారి వాదనలు లౌకిక వాదాన్ని ప్రతిబింబించాయని కొనియాడారు. ఉపాధ్యక్షులు డిఎల్ పాండు మాట్లాడుతూ.. నిబద్ధత గల అత్యుత్తమ న్యాయవాదుల్లో కొమిరెడ్డి రాములు, జ్యోతక్కలు ఒకరని, సామాన్య పౌరుల కోసం తమ జీవితాలను అంకితం చేశారని, రాజ్యాంగం, పౌర హక్కుల పవిత్రతను కాపాడే తమలాంటి యువ న్యాయవాదులకు కొమిరెడ్డి రాములు, జ్యోతక్కలు ఆదర్శప్రాయు లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి తనయులు హైకోర్టు న్యాయవాదులు, టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, విజయ్ ఆజాద్ లతోపాటు సీనియర్ న్యాయవాది రఘునాథ్ గారు, మాజీ ప్రెసిడెంట్ జగన్ గారు, సిరి న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ గారు మరియు బార్ అసోసియేషన్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, నిరంజన్ రెడ్డి, కాసుల వినోద్, తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ

▪ టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 27**
సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే తెలంగాణను ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలుపుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ లు సోమవారం ప్రమాణస్వీకారం చేసిన



సందర్భంగా నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యా, వైద్యం పై దృష్టి సారిస్తూ మంచి పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందించాలని చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.

